# సుమతికి సుమతికి మధ్యదూరం

— జయ

" నీకు తెలుగు భాష అర్థం అవుతుంది కదూ ?" శాంతంగా, తీరిగ్గా అడిగింది సుమతి. ఈ ప్రశాంతత వెనుక వచ్చే తుఫాను లక్ష్మికి తెలుసు. ప్రశాంతతకి, తుఫానుకి ఎంత సమయం తేడా ? రెండు నిముషాలా ? మూడు నిముషాలా ?

అర్థం అవుతుంది అన్నట్టు తల వూపింది లక్ష్మి.

"మూడు రోజుల క్రిందట పనిలోకి ఆలస్యంగా వచ్చినప్పుడు చెప్పింది గుర్తుందా ?"

వుందన్నట్టు తల వూపింది లక్ష్మి.

" ఎంత గుర్తుందో చెప్పు" చిరాకు, కోపం మిళితమై వున్నాయి సుమతి కంఠంలో.

"ప్రొద్దుటే ఆరు గంటలకల్లా పనిలోకి రాక పోతే పెద్దమ్మగారికి కష్టంగా వుంటుందని, అలా రావటానికి ఇబ్బందయితే పని మానెయ్యమని అన్నారు."

" అవును కదూ మరి యిప్పుడు ఏడవుతుండగా ఎందుకు వచ్చినట్లు నీకు రావాల్సిన జీతం డబ్బు పెద్దమ్మగార్ని అడిగి పట్టుకు పో. యికనుంచీ పనిలోకి రాకు."

లక్ష్మి మాట్లాడలేదు. అమ్మగారి దగ్గర మాటల ద్వారా ప్రయోజనం లేదని దానికి బాగానే తెలుసు. భుజాల చుట్టూ, చేతుల చుట్టూ కప్పుకున్న చీర కొంగుని తీసింది. చేతులు ముందుకు జాపింది. చేతుల మీద ఎర్రగా రక్తపు చారికలు. వెనక్కి తిరిగింది. నడుం మీద, వీపు మీద కదుములు, గాయాలు.

ఈసారి సుమతి మొహంలో యిదివరకటి ప్రశాంతత, నిర్లక్ష్యం చిరాకు లేవు. వాటి స్థానాన్నే జాలి, బాధ, దయ కన్పించాయి.

" ఎవరు కొట్టారు ?" కంఠంలో యిదివరకటి విసుగు, కోపం లేవు. వాటి స్థానాన్నే జాలి, బాధ, దయ కన్పించాయి.

" ఎవరు కొట్టారు ?" మెల్లిగా తనలోతను మాట్లాడుకుంటున్నట్టుగా అడిగింది. లక్ష్మి సమాధానం చెప్పటానికి తటపటాయిస్తోంది.

" మీ ఆయనా ?" అనుమానంగా అడిగింది సుమతి.

"కాదు" స్థిరంగా వుంది లక్ష్మి సమాధానం.

" మరి ఎవరు ?"

" అత్తా, పెద్దాడబడుచు "

సుమతి మొహంలో ఆశ్చర్యం, అపనమ్మకం



"మీ ఆయన ఏమంటారు?"

"ఆయన చాలా మంచి మనిషి. తల్లికి వ్యతిరేకంగా ఏమీ చెప్పలేరు. అమ్మ ఎలా చెబితే అలా చేయి అంటారు."

"అయితే వుద్యోగం మానెయ్యటానికే నిశ్చయించుకున్నావా?"

"సంసారం ప్రశాంతంగా సాగాలంటే యిది తప్ప మరో మార్గం లేదు." మాలతి కంఠంలో బాధ, కళ్ళల్లో నీటిపొర.

తనలో ఏర్పడిన బాధని, అసంతృప్తిని దాచుకుని "అప్పుడప్పుడు కనపడుతూ వుండు. మమ్మల్ని మర్చిపోకు" అంది మామూలుగా సుమతి.

మాలతి తల వూపి గబగబ వెళ్ళిపోయింది.

అయితే "స్త్రీకి స్త్రీయే శత్రువా?" పాపం మాలతి. పూర్ గర్ల్ అనుకుంది సుమతి.

*

"డియర్ రెండు రోజుల్లో బెంగుళూరు వెడుతున్నా" భార్య సుమతిని వుద్దేశించి అన్నాడు రామచంద్రం.

"అలాగా" ఆమెకి తెలుసు భర్త బెంగుళూర్ ఎందుకు వెడుతున్నాడో. "చూడు. బెంగుళూర్‌లో నీకు కావాల్సిన వస్తువులు ఏమన్నా వున్నాయా? చెప్పు. డోంట్ హెసిటేట్" అన్నాడు ప్రేమగా.

ఆ ప్రేమ వెనుకవున్న అతని అవసరం ఆమెకి తెలుసు.

ప్రేమకి అవసరానికి ఎంత తేడా?

నిజానికి నటనకి వున్నంత తేడా!

"ఎంత కావాలి?" ఆమె కంఠంలో అదే ప్రశాంతత, గంభీరత.

భార్య అలా డైరక్టుగా అడిగేసరికి చిరునవ్వు నవ్వాడు రామచంద్రం.

"అందుకే నువ్వంటే నాకిష్టం సుమా. సూటిగా విషయంలోకి వెడతావు. ట్వెంటీ థౌజండ్స్ కావాలి."

"అంత వుండదు. టెన్ వుంది. పట్టుకెళ్ళండి."

"టెన్ అంటే పదా? నమ్మలేకపోతున్నా. నువ్వు అబద్ధం చెబుతున్నావని కాదు. కాని నమ్మలేకపోతున్నా."

సుమతి తన బ్యాంకు బుక్కు తెచ్చి అతని ముందు పడేసింది. లోపల బేలెన్స్ చూసాడు. "చాలా ఖర్చయిపోయింది డియర్."

## ప్రగతి బాట

నింగిని విడిన
నీటి చుక్క
నేలను తాకి
నదిగ పారి
కడలిగ మారినట్లు–
పెదవిని దాటిన
మంచి మాట
మనసున నాటి
మనిషిని మార్చి
జగతి ప్రగతికి
బాట వేస్తుంది!

—అనసూయా మోహన్

"అవును కిందటి నెల పదిహేను. అంతకు ముందు పది తీసుకున్నారు".

"తీసుకున్నానా? సరిగ్గా జ్ఞాపకం లేదు. ఏమీ అనుకోకు డియర్ కాని ప్రస్తుతం యిరవై వేలు కావాలి."

"ఎక్కడి నుంచి తేను?"

"గుడ్. సలహా అడిగావుకదూ మీ ఫాదర్ని అడుగు."

"నాకిష్టం లేదు."

"యిష్టాల్ని, అయిష్టాల్ని ఒక ప్రక్కన పెట్టెయ్యి. మీ డాడీని అడుగు ఏమీ అనుకోరులే."

"ఏదో అనుకుంటారు అనికాదు. నాకిష్టం లేదు అంతే." తండ్రిని ఏనాడూ తను నోరు తెరిచి ఏదీ అడగలేదు. అసలు అడిగే అవసరమే తనకి కలగనివ్వలేదు. తన మనసెరిగి అడగకముందే అన్నీ కొని పెట్టేవారు. కాన్వెంటులో నుంచి కాలేజీలో చదువు, మంచి బట్టలు, మాచింగ్ నగలు, కొత్త మోడల్స్‌లో వచ్చే ఫారిన్ కారులు అన్నీ తను అడగకముందే తన యిష్టాల్ని గమనించి మరీ కొనేవారు. తన యిష్టాన్ని గమనించే రామచంద్రాన్ని తనకిచ్చి చేసారు. ఆ విషయంలోనే ఫాదరు పొరపాటు చేసారు. తను పొరపాటు పడింది. పొరపాటు చేసెయ్యటానికి, తిరిగి ఆ పొరపాటుని దిద్దుకోవటానికి ఎంతకాలం పడుతుంది? ఒక జీవితకాలం. భారంగా నవ్వుకుంది.

"ఏమిటి? నీలో నువ్వే నవ్వుకుంటున్నావు. నేను రెండు మూడు రోజుల్లో బాంబే వెళ్ళి వచ్చేస్తాను. రాగానే డబ్బు సిద్ధం చేసి వుంచు. ఓకే".

యిచ్చేస్తే ఓకే. యివ్వకపోతే.... క్షణకాలం ఆమె శరీరం, మనస్సు వణికాయి. అల్లకల్లోలం, అప్రశాంతత, గొడవలు, కీచులాటలు తను భరించ లేదు. సుమతి మొహంలో భయం కన్పించింది. అలాగేనన్నట్టు తల వూపింది.

సుమతి మొహంలో కన్పించిన భయం, తల వూపడం చూసి సంతృప్తిగా తనలో తను నవ్వుకుని వెళ్ళిపోయాడు రామచంద్రం.

మొదట 'కాదు' అని తన మాటకి వ్యతిరేకంగా చెప్పినా వెంటనే తను గట్టిగా మాట్లాడేసరికి బెంబేలు పడిపోతుంది. ఈ ఆడవాళ్ళని 'అబలలు' అని ఎవరు అన్నారోగాని సరిగ్గా అన్నారు, నవ్వుకున్నాడు రామచంద్రం.

*

ఫోను ఎత్తి డయల్ చేసింది సుమతి.

"ఎస్ రంగారావు స్పీకింగ్!" అవతల తండ్రి కంఠం.

"డాడీ నేను."

"నువ్వామ్మా బావున్నావా?"

"ఎస్ డాడీ బాగానే వున్నాను."

"అల్లుడుగారు బావున్నారా అమ్మా?"

"అందరూ బావున్నారు డాడీ."

తండ్రికి అనుమానం వేసింది. మరి ఫోన్ ఎందుకు చేసినట్టు ఈ సాయంత్రం. పొద్దుటే కదా యిక్కడికి వచ్చి వెళ్ళింది.

"డాడీ మీరూ అమ్మా బావున్నారా?"

"బ్రహ్మాండంగా వున్నామమ్మా."

ఎలా అడగాలి? అడిగెయ్యాలి. తప్పదు. నసుగుడు అంటే తనకి, డాడీకి కూడా యిష్టం వుండదు.

"డాడీ పదివేలు కావాలి."

పదివేలు యివ్వటం ఆయనకి ఒక లెక్క కాదు. కాని తనని అడిగేటంత అవసరం ఎందుకు వచ్చింది కూతురికి. కూతురు, అల్లుడు కూడా నెలకి మూడు వేలు పైగానే సంపాదించుకుంటున్నారు ఒక్కొక్కరూ. ఇప్పుడు ఎందుకు పది వేలు. "ఎందుకమ్మా ఆ డబ్బు?"

"కావాలి డాడీ."

"అల్లుడుగార్కా?"

"కాదు." కంఠంలో స్థిరత ధ్వనించింది.

"మరెందుకమ్మా?"

"మా ఆడబడుచు కూతురు పెళ్ళి. యిరవై వేలు సర్దమన్నారు. నా దగ్గర పదే వుంది."

"అదేమిటమ్మా మీ ఆడబడుచు వాళ్లు ఏమీ తక్కువ వున్నవాళ్ళు కారుగదా. అయినా ఈ డబ్బుంటీ అడిగే వాళ్ళంటే నాకు చిరాకు. నువ్వు మెత్తగా కనబడ్డావు వాళ్లకి. పాపం అల్లుడు కూడా నోరులేని మనిషి. సరేగాని నీ బ్యాంక్ బేలన్స్ పదివేలేనా వుంది?"

"అవును డాడీ మా అత్తగారు ఖర్చు మనిషి. దూబరా ఎక్కువగా చేస్తూ వుంటారు. కూతుళ్ళకి ఎంతసేపూ ఏం పెట్టాలా అని ఆలోచిస్తూనే వుంటారు. వాళ్ళకి అవనీ, యివనీ కొంటూనే వుంటారు. మీ అల్లుడు ఏమీ అనరు. పోనీలే అమ్మ ఏదో సర్దా పడుతోంది కూతుళ్ళకి పెట్టుకోవాలని అంటారు."

"పూర్ గర్ల్. మీ అత్తగారు పైకి అంత మంచిగా, మన్ననగా కనపడతారే! ఆవిడ దైవ భక్తి, పాప భీతి కలవారు. ఆవిడకి కూడా ఇలాంటి బుద్ధులేనా, అసలు యిలాంటి అత్తలు అడబడుచులు వల్లనే సంసారాలు నాశనం అయిపోతున్నాయి. అసలు నేనొకసారి వచ్చి గట్టిగా మాట్లాడతా వుండు."

సుమతి గాబరా పడిపోయింది.

"నో, ప్లీజ్ డాడీ మీరేం రావద్దు. ఈ సంసారం గొడవలు నేనే ఎలాగో సర్దుకుంటాను. అత్తగారు చివరి దశలో వున్నారు. యిప్పుడు ఆవిడని మీరలా మాటలు అనటం నాకు నచ్చదు. ఆవిడ ఎటువంటి పనులు చేసినా సరే."

"సరే. నువ్వు వద్దంటే నేను మాత్రం ఏందు కంటాను. నేను మన డ్రైవరుచేత రేప్రొద్దుటే ఆ డబ్బు పంపిస్తాను. నీ సంసారం నువ్వే చక్క బెట్టుకో. డబ్బు యిబ్బందిగా వున్నప్పుడల్లా నాకు చెప్పు" అని కన్నతండ్రికి యిలాంటి బాధ్యతలు, బాధలు తప్పవేమో అనుకున్నారు రంగారావుగారు.

"అలాగే డాడీ" అని ఫోన్ పెట్టేసి, హాలు లోకి వచ్చింది. హాలులో భగవద్గీత పారాయణం చేస్తున్న అత్తగార్ని చూడగానే ఒక్కసారి నిలువడి పోయింది సుమతి. తను మాట్లాడిన మాటలు తప్పకుండా వినే వుంటారు.

సుమతి అత్తగారు తలెత్తి చూసారు. కోడల్ని చూసి జాలిగా నవ్వారు. సుమతి మనస్సులో భావాలు చదివినట్టుగా "లేదమ్మా నేనేం అనుకోను. స్త్రీకి సహజం భర్త గౌరవాన్ని, మర్యాదని కాపాడా లనుకోవటం. అది ఆమెకి పుట్టుకతోనే వచ్చింది. భర్త తప్పు చేసినా, బయటి వాళ్లు తన భర్తని వేలెత్తి చూపటానికి, అసహ్యించుకోవటానికి ఇష్ట పడరు ఆడవాళ్ళు. అందుకే భర్త బలహీనతల్ని కప్పి పుచ్చి సదా అతన్ని అవతలివాళ్ళు ఏమీ అనడానికి ఆస్కారం యివ్వకుండా కాపాడాలను కుంటారు. భర్త కొట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు ఒక యిల్లాలికి మహా కోపం వచ్చిం దట. ఈ విషయంలో ఆడవాళ్లంతా ఒకటేనమ్మా. చదువుకున్న వాళ్ళయినా, చదువురాని వాళ్ళయినా. లక్ష్మి చూడు ప్రొద్దుట నీతో అబద్ధం ఆడిందా?"

"అబద్ధమా?" ఆశ్చర్యపోతూ అడిగింది సుమతి.

"ఆ! అబద్ధమే. నిజానికి తాగి వచ్చి జీతం డబ్బులు తన కివ్వకుండా దాచుకుంటోందని తెలిసి దాని మొగుడు కొట్టాడు. బయటికి అలా చెప్పు కోవటానికి దానికి యిష్టం వుండదు. ఎందుకు? చెప్పుకుని ఏం లాభం? అందరూ అతన్ని చీద రించుకుంటారు. చిరాగ్గా మాట్లాడతారు. ఏం పెళ్ళా నివి నాలుగు తిట్టో, రచ్చ కెక్కించో బుద్ధి చెప్పు కోలేవా? మొగుడికి లేకపోతే వెధవని వదిలెయ్యి తిక్క కుదురుతుంది. అని రకరకాలుగా సలహాలు విసురుతారు. అందులో ఏ ఒక్కటీ అది అను సరించలేదు. అందుకే లక్ష్మి ఈ మాటలు వినే యిష్టం లేక అలా చెప్పింది. పూర్వకాలంలో అంటే పతివ్రతల కాలంలో సుమతి భర్త కుష్టు వాడయినా, అతని బలహీనతల్ని అసహ్యించుకోవ టానికి బదులు బుట్టలో పెట్టుకుని వేశ్య యింటికి తీసుకు వెళ్ళిందని మీరంతా అసహ్యపడ్డారు. చిరాకు పడ్డారు. ఈ స్త్రీకి వ్యక్తిత్వం లేదా అని మహిళా వేదికలపై లావుపాటి వుపన్యాసాల్ని దంచారు అప్పటి సుమతికి, యిప్పటి సుమతికి తేడా ఏమిటమ్మా?"

కొన్ని శతాబ్దాలకాలం తేడా. అంతే స్త్రీ మనసు మాత్రం ఒక్కలాగానే ఆలోచిస్తోంది.

నుదుటి మీద పట్టిన చెమటని తుడుచుకుని, వచ్చి వరండాలో ఈజీచెయిర్‌లో కూర్చుంది సుమతి.

సుమతి ఆఫీసులో పనిచేసే స్టెనోగ్రాఫర్ కొన్ని టైప్ కాగితాలని పట్టుకుని వచ్చింది. "మీరు సైన్ చేసేస్తే ప్రొద్దుటే పోస్టులో పంపేస్తాను" అంది కాంతి.


"కూర్చో అలా. అలాగే సంతకం చేస్తాను గాని మాలతి రిజైన్ చేసేసింది. మళ్ళీ అలాంటి మంచి వుద్యోగి మనకు దొరకదు". కాంతి నిజమే అన్నట్టు తల వూపుతూ, "యిన్నాళ్ళు పాపం ఎలాగో నెట్టుకు వచ్చింది. యిక లాభం లేక పోయింది. రిజైన్ చేసేసింది."

ఆశ్చర్యంగా అర్థం కానట్టు చూసింది సుమతి.

"అవును లెండి. మీకు తెలీదు ఆ మాలతి మొగుడి విషయం. చాలా అనుమానం మనిషి. మాలతికి మన ఆఫీసులో పనిచేసే శ్రీధర్‌కి మధ్య సంబంధం కట్టి నానా మాటలు అంటూండేవాడు. ఏం చేస్తుంది పూర్‌గర్ల్ రిజైన్ చేసేసింది ఆఖరికి. అంతటితో తన కష్టాలు తీరిపోతాయి అనుకుం దేమో. అనుమానాలకి, అదీ భర్త అనుమానాలకి ఒక హద్దు వుందేమిటి? వుద్యోగం చేసినంత కాలం శ్రీధర్, మానేస్తే యింటి ఓనరు సుందర రామయ్యో, ఇంటిప్రక్క కాలేజీ అబ్బాయి ప్రభాకరో. యికనుంచీ అనుమానించాడనే బాధకి సాయం ఆర్థిక కష్టాలు కూడా నిట్టూర్పింది కాంతి.

"మరి నాతో యింకోలా చెప్పిందే. వాళ్ళత్త గారికి తను వుద్యోగం చెయ్యటం యిష్టం లేదని చెప్పింది."

కాంతి నవ్వింది చిన్నగా. "అవును అలా అనక యింకెలా అంటుంది మేడమ్. నిజం చెబితే మీరు అసహ్యంగా చూస్తారు. అలాంటి అను మానపు దౌర్భాగ్యుడికి భార్యగా వుండేది ఏమిటి అని గొప్ప వుపన్యాసం యిస్తారు. కాని సమా జంలో వున్న వ్యక్తులు ఆమెగాని అలా మొగుడ్ని



కోడిగ్రుడ్లు ఉడకబెడుతున్నప్పుడు చిట్లి విడి పడినట్లయితే వాటికి కొంచెం ఉప్పుగాని, వెనిగర్ గాని చేర్చినట్లయితే గ్రుడ్లను యధా రూపంలో వుంచుతాయి.

వదిలేసిందా, కాకుల్లా ప్రవర్తిస్తారు. ఆమె బ్రతుకు ఆమెని బ్రతకనివ్వరు. భర్తని వదిలిన ఆడదానికి గాని, భర్త వదిలేసిన ఆడదానికి గాని స్థానం లేని ఈ సమాజంలో ఎదురొడ్డి నిలువలేని సామాన్య స్త్రీ మాలతి. అందుకే జాబ్‌కి రిజైన్ చేసింది.''

"అయితే స్త్రీకి స్త్రీ శత్రువు కాదా?'' మనసులో మాట బయటికి అనేసింది సుమతి.

"కొన్ని సందర్భాలలో స్త్రీని స్త్రీయే బాధ పెడుతుంది. అవమానిస్తుంది. కాని దానికి పరిష్కార మార్గం సులభమయినది. భర్త సహకారం వుంటే తనని బాధపెట్టే స్త్రీని స్త్రీ ఎదుర్కోగలదు. కాని స్త్రీకి స్త్రీ సహకారం వున్నా తన భర్త దుర్మార్గాన్ని ఎదిరించలేదు. మనం పూర్తిగా భార్య మీద అన్ని హక్కులూ, అధికారాలు భర్తకిచ్చి అతడ్ని ప్రభువుని చేశాం. యిప్పుడు అతడ్ని సింహాసనం మీద నుంచి దిగమంటే దిగుతాడా?''

"స్త్రీ సహజంగా ప్రశాంతతని యిష్టపడుతుంది. తన చుట్టూ ప్రేమ సామ్రాజ్యాన్ని నెలకొల్పాలనుకుంటుంది. అందుకే భర్తతో దెబ్బలాటలు పెంచుకోవటానికి యిష్టపడదు. అతను చెప్పిందే వేదంగా, ఇష్టమున్నా లేకున్నా శిరసావహిస్తుంది. అక్కడ తన ఇష్టాన్ని, వ్యక్తిత్వాన్ని అణచుకొని ఆనందమయ జీవితంలో సుడిగాలులు రేగకుండా ఓర్పుతో కాపాడుకోవాలని చూస్తుంది. అంటే తనకి ఇష్టాయిష్టాలు లేవని కాదు. వ్యక్తిత్వం అసలు లేదనీకాదు. అయినా జీవితంలో ఓడిపోతోంది. ఓటమినన్నా సహిస్తున్నారు గాని ఒక మగవాడి దౌర్జన్యాన్ని ఎదిరించి బయట పడలేకపోతున్నారు... తిరుగుబాటు, ధైర్యం ఎంత మంది ఆడవాళ్ళకి వున్నాయి మేడమ్?'' ఈ మాటలు వెనుక అధికారాన్ని, క్రూరత్వాన్ని భరించ లేక విడాకులు తీసుకున్న స్త్రీ హృదయముంది.

సుమతి లేచి ఫోన్ తీసి, డయల్ చేసింది. అవతల తండ్రి ఫోన్ ఎత్తారు. "డబ్బు పంపొద్దు. ఆ అవసరం లేదు'' అని రిసీవర్ పెట్టేసింది.

*

మూడు రోజుల తర్వాత....

"డబ్బు రెడీ అయ్యిందా డియర్" ధీమాగా అడిగాడు రామచంద్రం.

"లేదు"

"లేదా?'' అతని మొహంలో ఆశ్చర్యం. పెళ్ళయి పది సంవత్సరాలు అయ్యాయి. కాని ఎప్పుడూ అతను ఈ మాట విని వుండలేదు.

"ఎందుకని?'' కఠినంగా అడిగాడు.

"నా దగ్గరలేదు. డాడీని అడగటం యిష్టం లేదు.''

"యిష్టం లేదూ? అదేం మాట'' ఆశ్చర్యం, కోపం, మిళితమై వున్నాయి అతని మాటల్లో. అసలు భార్యకి తన యిష్ట అయిష్టాల ప్రకారం నడుచుకోగలిగే స్వాతంత్ర్యం, ధైర్యం వున్నాయనేవి అతని వూహకి అందని విషయాలు.

"అవును. నాకిష్టం లేదు. డాడీని డబ్బడగటం. ఒక్కసారి అడిగి మీకు డబ్బు యిచ్చానా మీరు అలా అడుగుతూనే వుంటారు. దీనికి అంతం ఎక్కడ? మీకు భార్యా పిల్లలు కన్నా రేసులు, పార్టీలు ముఖ్యం. యింతకాలం అయ్యింది. కాని ఏనాడన్నా తండ్రిగా పిల్లల అవసరాలు చూసారా? భర్తగా నన్ను ప్రేమగా చూసారా? మీరు వుండీ లేనట్టయ్యారు మా జీవితాలకి.'''

రామచంద్రం కోపంతో మండిపడ్డాడు. "నీకు ఒంటి మీద స్పృహ వుండే మాట్లాడుతున్నావా? యిదివరలో ఒకసారి చెప్పాను యిలాంటి అడ్డమైన పొగరుబోతు సమాధానాలు చెప్పావంటే విడాకులు తీసుకోవాల్సిన అవసరం వస్తుందని.''

"నాకు హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోతున్నా. నేను విడాకులు యివ్వను. యిస్తే మరో స్త్రీని చేసుకుని ఆమెనీ యిలాగే డబ్బు కోసం పీడిస్తూ మీ జల్సాలు మీరు సాగిస్తారు. భార్యకి మనసు, యిష్టం, వ్యక్తిత్వం వున్నాయన్న సంగతి మీరెప్పుడయినా గమనించారా? గమనించిన రోజున మీ పద్ధతి మార్చుకుని భార్యని స్నేహితురాలిగా, హృదయమున్న మనిషిగా చూడగలిగే రోజున మళ్ళీ కలిసి బ్రతుకుదాం. లేదూ మీ దారి మీది నా దారి నాది.'' అని సుమతి అక్కడి నుంచి వెళ్ళిపోయింది. యింక మాట్లాడాల్సిన విషయాలు ఏమీ లేవన్నట్టు.

రామచంద్రం ద్రిగ్భాంతిగా అలాగే నిల్చుండి పోయాడు. ప్రవాహం ఎదురుతిరిగింది. అతను మాత్రం ప్రవాహానికి ఎంతకాలం ఎదురీదగలడు. □

## డా॥ వాసా ప్రభావతి



రచయిత్రి, కవయిత్రి అయిన డా॥ వాసా ప్రభావతి ఈ సంవత్సరం తెలంగాణా ప్రైవేట్ కాలేజీ టీచర్ల అసోసియేషన్‌కు ఉపాధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రస్తుతం హైద్రాబాదులోని సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయంలో తెలుగు భాషోపన్యాసకురాలుగా వుంటున్నారు. డా॥ వాసాప్రభావతి. తెలుగులో ఎమ్. ఎ. పట్టం పొందిన తర్వాత 1978 లో పి. హెచ్‌డి అందుకుని అదే సంవత్సరం లింగ్విస్టిక్ స్టడీస్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా పొందిన శ్రీమతి ప్రభావతి పాఠశాల దశనుంచే అనేక వక్తృత్వ, వ్యాస రచన పోటీలలో బహుమతులు గెలుపొందారు.

'అమ్మ', 'ఆలాపన' వంటి కవితా సంకలనాలు రచించిన శ్రీమతి ప్రభావతి రచనలు అనేక పత్రికలలో ప్రచురితమయ్యాయి. రేడియోలో ప్రసారితమయ్యాయి. విశ్వరచన నిర్వహించిన ఉగాది కథానికల పోటీలో ఈమె రచించిన 'బిచ్చగత్తె' కథానిక ప్రథమ బహుమతి పొందింది. వనితా జ్యోతి నిర్వహించిన కథల పోటీలో 'న్యాయం గుడ్డిది' కథకు కన్సొలేషన్ బహుమతి పొందారు.

హైద్రాబాదులోని శ్రీనివాస సాహితీ సమితి, అభినవ కళాసాహితీ సమితి వంటి సాహితీ సంస్థలతో సంబంధమున్న డా॥ వాసాప్రభావతి జాలీ ఫ్రెండ్స్ మహిళా విభాగానికి అధ్యక్షురాలుగానూ, భావన మహిళా విభాగానికి ఉపాధ్యక్షురాలుగానూ వుంటూ అనేక సాహితీ వేదికలపై ఉపన్యాసాలు ఇచ్చి, కవి సమ్మేళనాలలో పాల్గొని మన్ననలు అందుకున్నారు.